బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 26 జులై 2024 | www.balagamtv.com | పేజీలు 4

## నేడు ఒలంపిక్స్
# ప్రారంభోత్సవ సంబరాలు



**బలగం టీవీ , ప్యారిస్**

ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా విశ్వ క్రీడా సంగ్రామంఒలింపిక్స్‌కు శుక్రవారం తెరలేవనుంది. సాయంత్ర 7 గంటల నుంచి ఒలింపిక్స్ ఆరంభోత్సవ వేడుకలు జరుగనున్నాయి. సియోన్ నదిలో ప్రారంభోత్సవ వేడుకలు జరుగనున్నాయి. దీని కోసం ఫ్రాన్స్ ప్రభుత్వం, ఒలింపిక్స్ సంఘం కళ్లు చెదిరే ఏర్పాట్లు చేసింది. గతానికి భిన్నంగా ఈసారి ఒలింపిక్స్ ఆరంభోత్సవ వేడుకలు జరుగనున్నాయి. పారిస్ క్రీడల్లో ప్రపంచ వ్యాప్తంగా 202 దేశాలు పోటీపడనున్నాయి. ఈసారి కూడా అమెరికా, చైనాల మధ్య పతకాల కోసం గట్టి పోటీ నెలకొంది. భారత్ కూడా భారీ ఆశలతో బరిలోకి దిగుతోంది. కిందటిసారి సాధించిన ఏడు పతకాల కంటే ఈసారి అధికంగా సాధించాలనే పట్టుదలతో ఉంది. భారత కాలమానం ప్రకారం నేడు రాత్రి 11 గంటలకు వేడుకలు జరగనున్నాయి.



# తెలంగాణ బడ్జెట్..
# రూ.2.91 లక్షల కోట్లు

## వ్యవసాయ రంగానికి రూ. 72 వేల 659 కోట్లు..
## బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి

- అప్పులు పదేళ్లలో రూ.75,577 కోట్ల నుంచి రూ.6,71,751 కోట్లకు పెరిగినట్లు వెల్లడి
- హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు
- ఆర్ఆర్ఆర్‌కు రూ.1525 కోట్లు
- హెూంశాఖకు రూ. 9,564 కోట్లు

**బలగం టీవీ , హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ప్రతిపాదించారు.

అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ. 72 వేల 659 కోట్లు కేటాయించడంతో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీని ప్రకటించారు. ఇప్పటికే రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేశారు. ఆగస్ట్ 15 లోపు రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. అలాగే రైతులకు రైతు భరోసా కూడా ఇవ్వనున్నారు. గ్యాస్ సబ్సిడీ పథకానికి బడ్జెట్ లో 723 కోట్ల రూపాయలు కేటాయించగా.. గృహ జ్యోతి పథకానికి 2 వేల 418 కోట్ల రూపాయలు కేటాయించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి రూ. 29 వేల 816 కోట్లు కేటాయించగా.. హైదరాబాద్ సిటీ అభివృద్ధికి రూ. 10 వేల కోట్లు కేటాయించారు. బీసీ సంక్షేమానికి రూ. 9 వేల 200 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ. 3 వేల 3 కోట్లు, గృహ జ్యోతి పథకానికి 2 వేల 418 కోట్ల రూపాయలు కేటాయించారు.

## ఆరోగ్యశ్రీ పరిధిలోకి కొత్తగా 163 వ్యాధులు

ఆరోగ్య శ్రీ పథకం పరిధిని మరింత విస్తరించామని, ఈ పథకం పరిధిలోకి కొత్తగా 163 వ్యాధులను తీసుకొచ్చామని రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న 1,672 చికిత్సలలో 1,375 చికిత్సలకు ప్యాకేజీ ధరలను సగటున 20 శాతం చొప్పున పెంచినట్టు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ వైద్య వ్యవస్థ ప్రజా అవసరాలకు ఏమాత్రం సరిపోవడంలేదని అన్నారు. అసంపూర్తిగా ఉన్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, ఇతర హాస్పిటల్స్, నర్సింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజలందరికీ సకాలంలో నాణ్యమైన ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం సార్వజనిక ఆరోగ్య సంరక్షణ విధానానికి రూపకల్పన చేస్తూ కొన్ని ప్రత్యేక చర్యలు చేపట్టిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా ఆరోగ్య సేవలను పౌరులందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో డిజిటల్ ప్రొఫైల్ కార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు.ఇలా ప్రతి పౌరుడి దగ్గర డిజిటల్ ప్రొఫైల్ కార్డు ఉండటంవల్ల అందరి హెల్త్ హిస్టరీలో వాటిలో నమోదై ఉంటాయని, దాంతో వారికి వైద్య సేవలు అందించడం సులభం అవుతుందని మంత్రి తెలిపారు. దశల వారీగా దంత, నేత్ర, చెవి ముక్కు గొంతు, మానసిక ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన పరీక్షలను ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖకు ఈ బడ్జెట్‌లో రూ.11,468 కోట్లు ప్రతిపాదిస్తున్నామని అన్నారు.

## దేశం కంటే తెలంగాణ వృద్ధిరేటు అధికం..

యావత్ దేశం వృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధి రేటు అధికంగా ఉందని ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర, దేశీయ ఉత్పత్తి ప్రస్తుత ధరల ఆధారంగా లెక్కిస్తే రూ.14,63,963 కోట్లు అని చెప్పారు. గతేడాదితో పోలిస్తే 11.9 శాతం వృద్ధి రేటు నమోదయిందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ వృద్ధిరేటు 9.1 శాతం మాత్రమేనని వెల్లడించారు. గత ఆర్థిక ఏడాదికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3.2 శాతం అభివృద్ధి చెందింది. ఇదే కాలానికి భారత దేశ ఆర్థిక రంగం 7.6 శాతం, తెలంగాణ 7.4 శాతంగా వృద్ధిని నమోదుచేశాయన్నారు. అంటే గతేడాది తెలంగాణ వృద్ధిరేటు జాతీయ వృద్ధిరేటు కన్నా తక్కువ అని గమనించాలన్నారు. కాగా, ఆదాయాన్ని మించి రుణం నిరంతరంగా పెరుగుతుంటే తెలంగాణ ఆర్థిక స్వస్థత ప్రమాదంలో పడుతుందని తెలిపారు. దీనిని నిలువరించడానికి కఠోర ఆర్థిక సంస్కరణలు తీసుకురవాలని పేర్కొన్నారు. దానిని నివారించాలంటే ఆర్థిక వ్యయాన్ని, ఆదాయాన్ని సమన్వయ పరిచే చర్యలు తీసుకోవాలసిన అవసరం ఉందని చెప్పారు.

### తెలంగాణ బడ్జెట్ వివరాలు..

తెలంగాణ పూర్తిస్థాయి బడ్జెట్ : రూ.2,91,191 కోట్లు.
రెవెన్యూ వ్యయం - రూ.2,20,945 కోట్లు
మూలధన వ్యయం - రూ.33,487 కోట్లు
తెలంగాణ తలసరి ఆదాయం - రూ.3,47,299
తెలంగాణ ఏర్పాటు నాటికి అప్పు - రూ. 75,577 కోట్లు.
ఈ ఏడాది డిసెంబర్ నాటికి అప్పు - రూ. 6.71 లక్షల కోట్లు
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ. 42 వేల కోట్ల బకాయిలు చెల్లింపు.

## బడ్జెట్ కేటాయింపులు ఇలా...

రెవెన్యూ వ్యయం 2,20,945 కోట్లు
మూల ధన వ్యయం 33,487 కోట్లు
సాగునీటి పారుదల శాఖకు రూ.26 వే కోట్లు
సంక్షేమానికి రూ. 40 వేల కోట్లు
రోడ్లు భవనాలకు రూ.5,790 కోట్లు
హెూం శాఖకు 9,564 కోట్లు
గృహజ్యోతి పథకానికి రూ.2418 కోట్లు
వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.72,659 కోట్లు
హార్టికల్చర్ రూ.737 కోట్లు
పశుసంవర్ధక శాఖకు రూ. 19,080 కోట్లు
మహాలక్ష్మి ఉచిత రవాణాకు రూ.723 కోట్లు
ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3,836 కోట్లు
పంచాయతీ రాజ్ శాఖకు 29,816 కోట్లు
మహిళా శక్తి క్యాంటీన్ రూ.50 కోట్లు
హైదరాబాద్ అభివృద్ధికి రూ. 10,000 కోట్లు
జీహెచ్ఎంసీకి రూ.3,000 కోట్లు
హెచ్ఎండీఏకు రూ.500 కోట్లు
మెట్రో వాటర్‌కు రూ. 3,385 కోట్లు
హైడ్రా రూ.200 కోట్లు
ఏయిర్‌పోర్ట్ మెట్రోకు రూ.100 కోట్లు
ఓఆర్ఆర్‌కు రూ.200 కోట్లు
హైదరాబాద్ మెట్రోకు రూ.500 కోట్లు
ఓల్డ్ సిటీ మెట్రో రూ.500 కోట్లు
మూసీ అభివృద్ధికి రూ. 1500 కోట్లు
రీజినల్ రింగ్ రోడ్డు రూ.1500 కోట్లు
స్త్రీ శిశు సంక్షేమ శాఖకు రూ.2,736
ఎస్సీ,ఎస్టీ సంక్షేమానికి రూ.17,000
మైనారిటీ సంక్షేమం రూ.3,000
బీసీ సంక్షేమం రూ. 9,200 కోట్లు
వైద్య ఆరోగ్యం రూ.11,468 కోట్లు
విద్యుత్ రూ.16,410 కోట్లు
అడవులు ,పర్యావరణం రూ.1064 కోట్లు
ఐటీ రూ.774 కోట్లు
నీటి పారుదల రూ.22,301 కోట్లు

# బడ్జెట్ అంతా గ్యాస్.. ట్రాష్



- పేదల కోసం ఒక్క పాలసీ అయినా ప్రకటించారా..?
- మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్

**బలగం టీవీ , హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా గ్యాస్ అంతా ట్రాష్ అని మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రేవేశపెట్టిన బడ్జెట్‌పై కేసీఆర్ విరుచుకుపడ్డారు. ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

'రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలపై నీల్లుజల్లింది. రైతుభరోసాలో అనేక ఆంక్షలు పెడుతోంది. ప్రజల గొంతు కోసింది ప్రభుత్వం, దళితబంధు పథకం ప్రస్తావనే లేదు.. దళితులంటే ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా? గొర్రెల పెంపకం పథకానికి తూట్లు పొడిచారు. ఒత్తి పలకడం తప్ప భట్టి కొత్తగా చెప్పిందేమీ లేదు. రైతులను పొగిడినట్టే పొగిడి నిండా ముంచారు. బడ్జెట్ ఒట్టి డొల్ల.. ఈ అర్భక ప్రభుత్వం ఒక్క పాలసీ ఫార్ములేషన్ కూడా చేయలేదు.. ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసింది.. రైతులను ప్రభుత్వం వంచించింది. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదు' అని అన్నారు.

పేదల కోసం ఒక్క పాలసీ అయినా ప్రకటించారా? అంటూ కేసీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పెట్టిన బడ్జెట్‌లో ఒక పద్దు.. పద్ధతి లేదన్నారు. బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని స్పష్టం చేశారు. ఇది పూర్తిగా రైతు శత్రు ప్రభుత్వం అని విమర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి బడ్జెట్ ప్రసంగం రాజకీయ ప్రసంగంలా ఉందే తప్ప.. బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు లేదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరిగా లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవులు, మత్స్యకారులను పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చాం.. ప్రభుత్వానికి పాలసీ లేదని బడ్జెట్ చూసిన తర్వాత అర్థమైందన్నారు. కొత్తగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా కాంగ్రెస్ సర్కార్ ప్రకటించలేదన్నారు.

# ప్రజా వ్యతిరేక బడ్జెట్

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**బలగం టీవీ , హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. పలు పథకాల కోసం రూ.62వేల కోట్ల అప్పు ఎలా తెస్తారో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రూ.50 వేల కోట్ల అదనపు రెవెన్యూ ఎలా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో గమనిస్తున్నారని, రాష్ట్రాన్ని దివాలా తీసే దిశగా తీసుకెళ్తున్నారన్నారు. ఇచ్చిన హామీల మేరకు బడ్జెట్ ఇవ్వకుండా మోసం చేశారని ఆయన ధ్వజమెత్తారు. 35 లక్షల నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఎలా చెల్లిస్తారని మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇచ్చేందుకు బడ్జెట్ కేటాయించలేదని, మహిళలను మోసం చేసేలా బడ్జెట్ ప్రవేశపెట్టారని మహేశ్వర్ రెడ్డి విరుచుకుపడ్డారు. గృహలక్ష్మికి రూ.17500 కోట్లు కూడా కేటాయించలేదన్నారు. అరకొర నిధులతో ప్రాజెక్టులు ఎలా ముందుకు తీసుకువెళ్తారో సమాధానం చెప్పాలని ఏలేటి ప్రశ్నించారు. ఎస్ఆర్బీఎం పరిధి దాటి ఎలా అప్పు తెస్తారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కేవలం కొడంగల్ కోసమే ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంటూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎద్దేవాచేశారు.

### మాదాపూర్‌లో రేవ్ పార్టీ భగ్నం

- 14 మంది యువకులు, ఆరుగురు మహిళలు అరెస్ట్
- డ్రగ్స్ స్వాధీనం

వివరాలు 2వ పేజీలో

### అంకెల గారడీల బడ్జెట్

- రెండు లక్షల ఉద్యోగాల సంగతేంటి..?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

వివరాలు 3వ పేజీలో

### తెలంగాణలో నేడు భారీ వర్షాలు

- హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

వివరాలు 3వ పేజీలో

# కేంద్ర నిధులను బడ్జెట్‌లో ప్రస్తావించలేదు

- కేంద్రమంత్రి బండి సంజయ్

**బలగం టీవీ , హైదరాబాద్ బ్యూరో**

ఇందిరమ్మ ఇండ్లు,ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో కేంద్ర నిధులున్నాయని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం విడ్డూరం అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గాడిద గుడ్డు పెట్టడం ఎంత నిజమో.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం కూడా అంతే నిజమనేదానికి ఇవాళ్టి బడ్జెట్ నిదర్శనమని ఎద్దేవా చేశారు. భట్టి విక్రమార్క చదివింది ఆర్థిక బడ్జెట్టా లేక అప్పుల పత్రమా అని విమర్శించారు. అప్పులు ఉన్నందున హామీలు అమలు చేయలేమని చేతులెత్తేస్తున్నారా? అనినిలదీశారు. అప్పులు ఉన్నాయన్న విషయం ముందే తెలిసి కూడా ఆరు గ్యారంటీలు ఎందుకు ఇచ్చారని అడిగారు. ఇప్పుడు



వాటికి బడ్జెట్‌లో ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు.

ఆరు గ్యారంటీలు సహా హామీల అమలుపై చర్చ జరగకుండా ఉండేందుకే కేంద్రాన్ని బద్నాం చేయాలని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. బడ్జెట్ కేటాయింపులకు సరిపడా ఆదాయం ఎక్కడి నుంచి సమకూర్చుకుంటారో బడ్జెట్‌లో లెక్కా పత్రం చూపించకపోవడం విడ్డూరమని విమర్శించారు.

రుణ మాఫీ వల్ల రైతులకు లాభం కంటే నష్టమే జరిగిందని ప్రభుత్వమే ఒప్పుకుందని బండి సంజయ్ అన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని పూడ్చి డిఫాల్టర్ల జాబితా నుంచి తొలగిస్తారా? లేదా? చెప్పాలని నిలదీశారు. ఏడాదిపాటు నష్టపోయిన రైతు భరోసా, రూ.500 పంట బోనస్, పంట నష్ట పరిహారం నిధులను కూడా ఈ ఏడాది చెల్లిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉంటే.. 39 లక్షల మందికే గ్యాస్ సబ్సిడీ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం దారుణమని అన్నారు. 50 లక్షల మంది అర్హులకు రూ.500 సబ్సిడీని ఎగ్గొట్టి మహిళల్లో వెలుగులు నింపామని చెప్పుకోవడం సిగ్గు చేటు అని విమర్శించారు.

బడ్జెట్‌లోని చివరి పేజీలో ప్రస్తావించిన మహాత్ముడి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని బండి సంజయ్ మిగితా 3వ పేజీలో

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్ర జరుగుతోంది

- మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ పరిశీలన



**బలగం టీవీ , హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టును వృథా ప్రయత్నంగా చూపించే కుట్ర జరుగుతుందని మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలించేందుకు బీఆర్ఎస్ నేతల బృందం గురువారం బయల్దేరి వెళ్లింది. కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లను సందర్శిస్తున్నామని తెలిపారు. ఎండిపోతున్న పొలాలు, మండుతున్న రైతుల గుండెలను చూడ్డానికే వచ్చామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ లెవల్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు సాయంతో పంజాబ్‌ను తలదన్నేలా తెలంగాణ ధాన్యం పండించిందని గుర్తు చేశారు. ప్రతినీటి బొట్టును ఒడిసిపెట్టాలన్న సంకల్పంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని తెలిపారు. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టును వృథా ప్రయత్నంగా చూపించే కుట్ర జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ఎనిమిది నెలలుగా ప్రయత్నం జరుగుతున్నదని మండిపడ్డారు. రాజకీయ కక్షలు పెట్టుకుని రైతులను ఆగం చేయవద్దన్నారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ ఏడాది 45 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని అధికారులు చెబుతున్నారని అన్నారు. కాబట్టి నీళ్ల వృథా పోకుండా వెంటనే రిజర్వాయర్లను నింపాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గర 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు కిందకు వృథాగా పోతుందని ఇంజనీర్లు చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం రిజర్వాయర్‌లో 240 టీఎంసీల నీళ్లను నింపుకోవచ్చని తెలిపారు. అంటే 24 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చని పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థులు

# ఉన్నత విద్య సంస్థల్లో సీటు సాధించేలా శిక్షణ ఇవ్వాలి

- ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టుల పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి..
- ఇంటర్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు..
- కలెక్టర్ సందీప్ కుమార్



**బలగం టీవి , రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రణాళిక అబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇంటర్మీడియట్ విద్య పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల జిల్లాలో ఉన్న జూనియర్ కళాశాలలు, విద్యాశాఖ పరిధిలో ఉన్న ఇంటర్మీడియట్ విద్య సంస్థలు, విద్యార్థుల ఎన్రోల్మెంట్, కోర్సుల వివరాలు, హాజరు మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

సిరిసిల్ల జిల్లాలో మొత్తం 10 జూనియర్ కళాశాలలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు మొదలైనవి మరో 31 విద్యా సంస్థల్లో ఇంటర్మీడియట్ విద్య బోధించడం జరుగుతుందని అన్నారు. ఎంపిసి, బైపిసి,సిఈసి,హెచ్ఈసి వంటి రెగ్యులర్ కోర్సులు, మరో 5 ఒకేషనల్ కోర్సులు ఉన్నాయని, సుమారు 3 వేలకు పైగా విద్యార్థులు జిల్లాలో ఇంటర్ విద్య అభ్యసిస్తున్నారని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సందీప్ కుమార్ ఝు ఇంటర్ విద్యార్థుల అవసరాల మేరకు సురక్షిత త్రాగు నీటి సరఫరా ఉండాలని, దీని కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు .కళాశాల భవనాల స్థితిగతులు, టాయిలెట్స్, విద్యుత్ పరికరాలు, ఫ్యాన్లు, మౌలిక వసతుల పై అడిగి తెలుసుకున్నారు. కావాల్సిన అన్ని ఏర్పాట్లపై సమగ్ర నివేదికను ఇవ్వాలని అధికారు ల ను ఆదేశించారు. ఇంటర్ విద్యార్థుల ఆంగ్లము, మ్యాథ్స్, ఎకనామిక్స్ లలో సామర్థ్యం పెంపొందించడం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అదే విధంగా గణితం పట్ల అధిక శ్రద్ధ చూపించాలని, పోటీ పరీక్షల్లో విద్యార్థులకు ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు సాధించేలా బోధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఐవో మోహన్ , కళాశాల ప్రిన్సిపాల్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థి దీప్తికి కేటీఆర్ అండ

- చదువు పూర్తి చేయటానికి అయ్యే మొత్తం ఖర్చు భరిస్తానని హామీ..

**బలగం టీవి , రాజన్న సిరిసిల్ల**

నిరుపేద విద్యార్థినికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అండగా నిలిచారు. ఐఐటీగౌహతి లో సీటు సంపాదించిన ఆ సరస్వతి పుత్రికకు, ఆమె విద్యా భ్యాసం పూర్తయ్యే వరకు తాను బాధ్యత తీసుకుంటానని కేటీఆర్ భరోసాని చ్చారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు సోమిరెడ్డి పద్మ–చంద్రంల కూతురు దీప్తికి ఇటీవలే ఐఐటీ గౌహతిలో డేటా సైన్స్ అండ్ అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సులో సీటు వచ్చింది. కానీ ఐఐటీ లాంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో చదివేందుకు కావాల్సినంత ఆర్థిక స్థోమత ఆ కుటుంబానికి లేకపోవ డంతో, దీప్తి కుటుంబ సభ్యులు దాతల నుంచి ఆర్థిక సాయం కోసం ప్రయత్నించారు. ఈ విషయం సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి రావడంతో ఆయన ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఐఐటీ లాంటి ప్రతిష్మాత్మక విద్యాసంస్థలో సీటు రావటమంటే చాలా గొప్ప విషయమని విద్యార్థిని దీప్తిని ప్రశంసించారు. బర్త్డే సందర్భంగా కేటీఆర్ ను కలిసేందుకు హైదరాబాద్ వచ్చిన దీప్తి కుటుంబానికి ఆయన ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దీప్తి నాలుగేళ్ల కోర్సు పూర్తి చేయటానికి కావాల్సిన మొత్తం ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా దీప్తికి లాప్ టాప్ ను కూడా బహుకరించారు. చదువు పూర్తి చేసి ఉన్నత స్థాయికి చేరా లని ఈ సందర్భంగా దీప్తిని కేటీఆర్ కోరారు.దీంతో దీప్తి, ఆమె తల్లితండ్రులు కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# కాలేజీలో కావాల్సిన సౌకర్యాలపై నివేదిక ఇవ్వండి



- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రభుత్వ జూనియర్ కాలేజీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**బలగం టీవి, వేములవాడ,**

కాలేజీలో కావాల్సిన సౌకర్యాలపై ఒక నివేదిక ఇవ్వాలని,ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గురువారం వేములవాడ ప్రభుత్వ జూనియర్ కాలేజీని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, భవనం, స్విచ్ బోర్డ్స్, ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, టాయిలెట్స్, కళాశాల మైదానం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. గతేడాది ఇంటర్ ఫలితాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. కాలేజీ మైదానంలో నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని,తరగతి గదులు, ఆవరణలో పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

- 100 గ్రాముల గంజాయి స్వాధీనం.
- చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు..

**బలగం టీవీ,చందుర్తి**




గంజాయి కేసులో ఒకరిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, రిమాండ్కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. చందుర్తి మండల కేంద్రంలోని సీఐ సర్కిల్ ఆఫీసు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...కొనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన వడ్లూరి వెంకటేష్ గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడు. జగిత్యాల జిల్లా కోడీమ్యాల మండలం తిప్పాయిపల్లి, భీమ్గల్ ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద అతను గంజాయి కొనుగోలు చేసి, అట్టి గంజాయి తాగగా మిగిలిన గంజాయిని అలవాటు పడిన వ్యక్తులకు అమ్ముతుండే వాడు. ఇదే క్రమంలో గురువారం వెంకటేష్ సుద్దాల గ్రామానికి వస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం మేరకు సుద్దాల గ్రామ శివారులో వెంకటేష్ను పోలీసులు అదుపులోకి తీసుకొని 100 గ్రాముల గంజాయి సీజ్ చేసి అతన్ని రిమాండ్కు తరలించడం జరిగిందని అన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్..

- 7 గురిపై కేసు నమోదు..
- సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ

**బలగం టీవి, సిరిసిల్ల**



సిరిసిల్ల పట్టణంలోని అంబికా నగర్ లో బుధవారంఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ట్టు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 9,500/– రూపాయల నగదు, 7 మొబైల్ ఫోన్స్,రెండు ద్విచక్ర వాహనలు, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకొని వారి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు సిరిసిల్ల టౌన్ సిఐ కృష్ణ తెలిపారు .ఈ సందర్భంగా సిఐ కృష్ణ మాట్లాడుతూ సులభ సంపాదనకు అలవాటుపడి కొంతమంది ఈ విధంగా చెడు వ్యసనాలకు అలవాటు పడి చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడుతు ఆభరణాలు, వాహనాలను తాకట్టు పెడుతూ కుటుంబాలను సర్వనాశనం చేసుకుంటున్నారని తెలిపారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పేకాట స్థావరాలపై నిత్యం పోలీస్ ల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిరహిస్తామని,ఎవరైన, గ్యాంబ్లింగ్, బెట్టింగులకు కానీ, పేకాట వంటి జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. మీ ప్రాంతంలో ఇటువంటివి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతే, వెంటనే సంబంధిత పోలీస్ వారికి లేదా డయల్100 కి సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది అన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు



**బలగం టీవి, సిరిసిల్ల**

మూల మలుపుల వద్ద,ప్రమాదాలు జరుగు ప్రదేశాల్లో సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులకు సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు గురువారం ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల సురక్షిత ప్రయాణానికి ప్రధాన రహదారులు వెంబడి ముల మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించడానికి, రోడ్ల పై మూల మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరుగు ప్రదేశాలను గుర్తించి భారీ కేడ్స్, రబ్బర్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్లను ఏర్పాటు చేశారు. అలాగే డేంజర్ బోర్డ్స్, రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డు ప్రమాద నివారణ చర్యలను చేపట్టారు.

# వివాహితకు సైబర్ నేరగాళ్ల బ్లాక్మెయిల్

**బలగం టీవి , హైదరాబాద్**

సైబర్ నేరగాళ్లు ఓ వివాహితను బ్లాక్మెయిల్ చేసి.. రూ. 3 లక్షలు కాజేశారు. గృహిణికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయంటూ.. ఇన్స్టాగ్రామ్లో ఓ సందేశం వచ్చింది. ఆ లింక్ను క్లిక్ చేయగానే..మొబైల్కు ఓటీపీ వచ్చింది. ఆ నెంబర్ నమోదు చేయడంతో సైబర్నేరగాళ్లు ఆ ఫోన్ను హ్యాక్ చేశారు. ఈ క్రమంలో కొన్ని రోజులకు ఆమె ఫోన్కు నగ్న ఫొటోలు వచ్చాయి. 'ఈ ఫొటోలను నీ ఫోన్లోని కాంటాక్ట్లో ఉన్న వారందరికీ పంపిస్తాం' అంటూ నిందితులు బెదిరించారు. ఈ రకంగా పలు దఫాలుగా డబ్బులు వసూలు చేశారు. వాట్సాప్ నుంచి ఆ ఫొటోలు డిలీట్ చేయాలంటే డబ్బులు ఇవ్వాలంటూ.. తనను బెదిరిస్తున్నారంటూ.. బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేపట్టారు

# కలెక్టర్ను కలిసిన డీఎంహెచ్ఓ వసంతరావు

**బలగం టీవి, సిరిసిల్ల**



డీఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన ఎం. వసంతరావు గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆఫీస్ లో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్., రజిత,డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్. రాజగోపాల్, పరిపాలన అధికారి చేపూరి శ్రీనివాస్ , డెమో రాజకుమార్, డీపీఎంవోలు సురేష్, శ్రీనివాస్ హెచ్ఈఓ లింగం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




**బలగం టీవి , తంగళ్లపల్లి**

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ మరియు సీనియర్ జడ్జి రాధిక జస్వాల్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ సంయుక్త అవగాహన కార్యక్రమంలో భాగంగా బద్దెనపల్లి గురుకుల రెసిడెన్షియల్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ జడ్జి రాధిక జస్వాల్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని,భవిష్యత్తు ప్రణాళిక సూచనలు,హెల్ప్ లైన్ నెంబర్లు తెలపడం జరిగింది, కౌమార దశలో వస్తున్నటువంటి మార్పులని అర్థం చేసుకుంటూ వాటికనుగుణంగా వాళ్ళ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ బాల్యవివాహాలు,బాల కార్మికులు, బాలికల మీద అఘాయిత్యాలు,లైంగిక వేధింపులు వంటివి జరిగినప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి చెప్పాలని, 1098 టోల్ ఫ్రీ నెంబర్ ని సంప్రదిస్తే సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం తోపాటు తగిన సహాయాన్ని వెంటనే అందించడం జరుగు తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా మాట్లాడుతూ సేఫ్ టచ్ అండ్ అన్ సేఫ్ టచ్ మల్లాసి సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్నటువంటి సేవలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పద్మ, డిఎల్ఎస్ఎ, డిహబ్, సఖి ,బాల రక్ష భవన్ సిబ్బంది,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహా చండీ యాగంలో పాల్గొనాలని కేటీఆర్కు ఆహ్వానం



**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్లలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నివారణ కోసం సిరిసిల్ల పట్టణంలోని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఈనెల 28 వ తేదీ నుండి 31వ తేదీ వరకు మహా చండీయాగంలో పాల్గొనవలసిందిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే ఎమ్మెల్యే కేటీఆర్ను సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకుల కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ గాజుల బాలయ్య , మోర రవి , ప్రధాన కార్యదర్శి మండల సత్యం,పద్మశాలి కళ్యాణ భవనం అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస్ , కౌన్సిలర్ సభ్యులు దార్నం అరుణ లక్ష్మీనారాయణ, జిందం చక్రపాణి , బొల్లి రామ్మోహన్ , గాజుల నారాయణ , ఏనుగుల ఎల్లయ్య , సామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టపాచబుత్రలో వ్యక్తి అనుమానస్పద మృతి

**బలగం టీవి , హైదరాబాద్**



అనుమానస్పదస్థితో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన టపాచపుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సమీర్ లైటింగ్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తు న్నాడు, పనిమీది నాగర్కర్నూలు వెళ్లాడు.నాగర్ కర్నూల్లో కాంట్రాక్ట్ పని మీద వెళ్లిన సమీర్.. తాగి వాహనం పై నుంచి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స చేయించుకొని నాగర్కర్నూల్ నుంచి నగరంలోని తాళ్లగడ్డకు చేరుకున్నాడు. రాత్రి పడుకున్న సమీర్ గురువారం ఉదయం లేవకపోవడంతో తోటి కార్మికులు కాంట్రాక్టర్కు సమాచారమిచ్చారు. సమీర్ మృతిచెందిన విషయం కాంట్రాక్టర్ పోలీసులకు చెప్పాడు. వెంటనే టపాచబుత్ర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సమీర్ మృతి పైన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తోటి కార్మికులను విచారిస్తున్నారు.

# కాన్షీరామ్కు భారత రత్న ఇవ్వాలి


- బీజేపీ ఎంపీ అరుణ్ కుమార్ సాగర్

**బలగం టీవి, న్యూఢిల్లీ**



బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్కు అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ఇవ్వాలని ఇవాళ బీజేపీ ఎంపీ అరుణ్ కుమార్ సాగర్ లోక్సభలో డిమాండ్ చేశారు. ఈ సమాజానికి, దేశానికి కాన్షీరామ్ ఎంతో చేశారని, ఆ నేతను భారత రత్న అవార్డుతో సత్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. లోక్సభ జీరో అవర్లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కాన్షీరాం బహుజన నాయకుడు అని ప్రశంసించారు. బీఎస్పీ నేత ఓ మేటి రాజకీయవేత్త అని, సామాజిక సంస్కర్త అని, అణగారినవర్గాల ప్రజల సంక్షేమం కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. దళితుల కోసం ఆయన జీవితాన్ని అర్పించినట్లు చెప్పారు.దళిత రాజనీతిలో ఆయన ప్రత్యేక స్థానాన్ని సంపాదించినట్లు తెలిపారు.

# మాదాపూర్లో రేవ్ పార్టీ భగ్నం



**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్లో మరో రేవ్ పార్టీని హైదరాబాద్ పోలీసులు భగ్నం చేశారు. నగరంలోని మాదాపూర్లో ఓ అపార్ట్మెంట్లో ఈ రేవ్ పార్టీ నిర్వహిస్తున్నట్లుగా పోలీసులు వెల్లడించారు. ఈ విషయం గురించి ముందస్తు సమాచారం అందడంతో మాదాపూర్ లోని ఆ అపార్ట్మెంట్పై తెలంగాణ టాస్క్ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేశారు. మొత్తం 14 మంది యువకులు, ఆరుగురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ రేవ్ పార్టీని ఐదుగురు నిర్వహించారని, వారిపై కేసు నమోదు చేశారు. మిగిలిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపిం చారు. ఇందులో కొందరు డ్రగ్స్ సేవించినట్లుగా కూడా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రేవ్ పార్టీలో ఒక గ్రాము కొకైన్, రెండు గ్రాముల ఎండిఎంఏ, 0.84 గ్రాముల ఓజీ ఖుష్, ఇతర మాదకద్రవ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నాగరాజు అనే వ్యక్తితో పాటు, మరో రియల్ ఎస్టేట్ వ్యక్తి సాయి కుమార్, పలువురు బిటెక్ స్టూడెంట్స్ కలిసి ఈ ఈవెంట్ ప్రమోటర్ కిషోర్ను అదుపులోకి తీసుకున్నట్లుగా పోలీసులు వెల్లడించారు.

# బడ్జెట్లో తెలంగాణకు మోడీ శఠగోపం పెట్టిండు

- తెలంగాణకు బీజేపీ బడ్జెట్ ద్రోహం..
- బడ్జెట్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ను నిలదీయండి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు




**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

బడ్జెట్లో తెలంగాణకు మోడీ శఠగోపం పెట్టిండు అని.. కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేసిందని, కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధులు తేవడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ విఫలమయ్యాడని,ప్రజలు బండి సంజయ్ను నిలదీయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ స్కైలాబ్ బాబు అన్నారు.గురువారం సిరిసిల్లలో సీపీఐ(ఎం) కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా టీ స్కైలాబ్ బాబు హాజరై మాట్లాడారు.

కేంద్ర బడ్జెట్లో తెలంగాణ పట్ల బీజేపీ సర్కార్ అనుసరించిన తీరు, ప్రాజెక్టుల నుంచి మొదలుకుని పరిశ్రమల వరకు నిధుల కేటాయింపులో చాలా అన్యాయం జరిగిందన్నారు బడ్జెట్లో ఏపీ పునర్విభజన చట్టం గురించి పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ఎక్కడా తెలంగాణ ఊసేత్తలేదని, బీజేపీని రాష్ట్ర ప్రజలు అక్కున చేర్చుకుని 8 సీట్లు కట్టబెట్టినందుకు రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. మూసీ రివర్ఫ్రంట్ అభివృద్ధి, రీజినల్ రింగ్రోడ్ నిర్మాణంపై రాష్ట్రం చేసిన విజ్ఞప్తిని పట్టించుకోలేదని, బడ్జెట్ మొత్తంలో తెలంగాణకు సంబంధించి హైదరాబాద్, బెంగళూరు ఇండిస్ట్రియల్ కారిడార్ అంశాన్ని మాత్రమే ప్రస్తావించారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్కు ఆర్థిక తోడ్పాటునందిస్తామని చెప్పారే తప్ప ఎన్ని నిధులు వెచ్చిస్తారో వెల్లడించలేదన్నారు. వెనుకబడిన జిల్లాలకు నిధులివ్వాలన్న విజ్ఞప్తిని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హొదా పక్కన పెడితే, కనీసం అక్సిలిరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ స్కీంలో కూడా పరిగణలోకి తీసుకోలేదన్నారు . సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్ టైల్ పార్క్కు ఆర్థిక సాయం, ఇండిస్ట్రియల్ కారిడార్లకు నిధుల ఊసు లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టారని అన్నారు.ఉత్తర తెలంగాణ జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే హైదరాబాద్, నాగ్పూర్ పారిశ్రామిక కారిడార్కు నిధుల ప్రస్తావన, ఖాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, నవోదయ విద్యాలయాలు, రైల్వే లైన్లు తదితర అంశాలను పట్టించు కోలేదు అని అన్నారు.

తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి శఠగోపం పెట్టింది అని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ను ప్రత్యేకంగా ప్రస్తావించినా, ఆ చట్టం పరిధిలోకి వచ్చే తెలంగాణ పేరును మాత్రం ప్రస్తావించకపోవడం దారణమని అన్నారు. అక్కున చేర్చుకుని అందలం ఎక్కిస్తే మోడీ సర్కార్ తెలంగాణ ప్రజలకు మంచి పాఠం చెప్పారని, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు తమ పదవుల కోసం లాలూచి పడ్డారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్ జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, ఎర్ర వేల్లి నాగరాజు,సూరం పద్మ ,మల్లారపు ప్రశాంత్, ప్రజాసంఘాల నాయి ఎకులు అన్నల్దాస్ గణేష్,రమేష్,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పాఠాలు బోధించిన రాష్ట్రపతి



**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రపతి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఉపాధ్యాయురాలిగా మారారు. ఆమె రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా ప్రెసిడెంట్స్ ఎస్టేట్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల, ఆ సమస్యను నిరోధించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి తొమ్మిదో తరగతి విద్యార్థులకు బోధించారు. నీటి పరిరక్షణ అవసరాన్ని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావం తగ్గాలంటే మరిన్ని చెట్లను నాటాలని తెలిపారు.

# మహారాష్ట్రలో వర్షాల ధాటికి ఆరుగురు మృతి

**బలగం టీవి , ముంబై**

మహారాష్ట్రలో ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం భారీ వర్షాలకు వివిధ సంఘటనల్లో మొత్తం ఆరుగురు మృతి చెందారు. పుణెలో మొత్తం నలుగురు చనిపోగా వీరిలో ముగ్గురు కరెంట్‌షాక్‌కు బలయ్యారు. థానే బర్విడామ్‌లో వరద నీటిలో ఇద్దరు మునిగి మృతి చెందారు. భారీ వర్షపాతంతో ముంబై, పాల్ఘర్‌లకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు ముంబైలో వాతావరణ విభాగం రెడ్ అలర్ట్ జారీ చేసింది.

ముంబై శాంతాక్రూజ్ లోని అబ్జర్వేటరీ ఈ నెలలో ఇంతవరకు 1500 మిమీ వర్షపాతాన్ని నమోదు చేసి, ముంబై నగర చరిత్రలో రెండో భారీ వర్ష జులై నెలగా రికార్డుకెక్కింది. గత ఏడాది ముంబైలో జులై లోనే 1771 మిమీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. రాష్ట్రం లోని కుండాలిక, అంబ నదులతోపాటు మొత్తం నాలుగు నదులు ప్రమాదస్థాయి మించి వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నదీతీర ప్రాంతంలో ఉన్న గ్రామాలకు , ఇతర నివాసాలకు ముంపు ముప్పు పొంచి ఉండడంతో లోతట్టు ప్రజలను వేరే చోటికి తరలిస్తున్నారు. ముంబై ఛత్రపతి శివాజీ విమానాశ్రయానికి ఆనుకుని ఉన్న మిథి నది ప్రమాదస్థాయికి కేవలం ఒక మీటరు దిగువన ప్రవహిస్తోంది. వర్షాల కారణంగానే విమాన సర్వీసులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. విమానాల రాకపోకల్లో ఆలస్యం జరుగుతోందని ఇండిగో, స్పైస్‌జెట్ సంస్థలు తెలిపాయి.



ముంబై నగరంలా పుణె కూడా భారీ వర్షాలతో సతమతమవుతోంది. శుక్రవారం ఉదయం వరకు రెడ్ అలర్ట్ జారీ అయింది. ఏక్తానగ్రి, విఠల్ నగర్, కల్యాణినగర్ లోని హౌసింగ్ సొసైటీలు భారీ వరద నీటితో అల్లాడుతున్నాయి. డైజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌లను అవసరమైతే సహాయం అందించడానికి సిద్ధం చేశారు. స్కూళ్లు, కాలేజీలు మూత పడ్డాయి. పింప్రి చించివాడ లోని మోర్య గోసవి గణపతి ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. డిప్యూటీ సిఎం అజిత్ పవార్ వరద బాధిత ప్రాంతాలను సందర్శించారు. సహాయ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

# అంకెల గారడీల బడ్జెట్



- రెండు లక్షల ఉద్యోగాల సంగతేంటి..?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

ఎన్నికల్లో గ్యారెంటీల గారడీ.. బడ్జెట్‌లో అంకెల గారడీగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ఉందన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఆసరా పెన్షన్‌ల ప్రస్తావన తేకుండా వితంతువులు, వృద్ధులు, వికలాంగులను ప్రభుత్వం నిరాశపర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారుకు పేదల ప్రభుత్వం అని చెప్పుకునే అర్హత లేదని అన్నారు. ఇది రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపే బడ్జెట్ అనిఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గొప్పలకు పోయిన కాంగ్రెస్ సర్కారు.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే తేకపోవడం దారుణమని అన్నారు. ఆర్భాటంగా అభయ హస్తం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆరు గ్యారెంటీ ఊసెత్తలేదని మండిపడ్డారు.ఆసరా పింఛన్‌లు పెంచుతామని ఎన్నికల్లో హామీలు ఇచ్చారని, వృద్ధుల పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావన ఎందుకు చేయలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పడం ద్వారా ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న సర్కారు.. ఇప్పుడు రెండు లక్షల ఉద్యోగాల గురించి మాట్లాడలేదని, మాయమాటలతో విద్యార్థులను మోసం చేసిందని హరీష్‌రావు మండిపడ్డారు. ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పారని, ఇప్పుడు ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరి కారణంగా ఇప్పటికే 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు. సూపర్ స్టార్ కు కనిపించిన అభివృద్ధి ఈ ఘజనీ స్టార్ లకు కనిపించదు మేనిఫెస్టోను ప్రతిబింబించేలా బడ్జెట్ ఉండాలి కానీ దురదృష్టవశాత్తూ అలా లేదని అన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన నెలకు రూ.2500 సాయం కోసం కోటి మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు అయినప్పటికీ మహిళలకు ఆర్థిక సహాయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. . బడ్జెట్‌లో విద్యా భరోసా కార్డు అంశాన్ని ప్రభుత్వం మర్చిపోయిందన్నారు.

కొత్త రేషన్ కార్డు ఎప్పటీ నుండి ఇస్తారో చెప్పలేదు. జ్యాబ్ క్యాలెండర్ ప్రస్థావన లేదని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని తాము నిర్లక్ష్యం చేశామని భట్టి పేర్కొనడం పట్ల హరీశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని బీఆర్ఎస్ కొనసాగించిందని చంద్రబాబు అన్నారు. హైదరాబాద్ డెవలప్మెంట్‌ను సూపర్ స్టార్ రజనీ కాంత్ పొగిడారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి రజనీకి కనిపించింది కానీ కాంగ్రెస్ గజినీలకు కనిపించలేదు అని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన కారణంగానే తెలంగాణ తలసరి ఆదాయం పెరిగిందన్నారు.

## గ్యారెంటీలను గంగలో కలిపిన బడ్జెట్

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర బడ్జెట్ గ్యారెంటీలను గంగలో కలిపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని, ఇది పూర్తిగా కోతల, ఎగవేతల బడ్జెట్ ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో ఎన్నికల వాగ్దానాలను గాలికి వదిలేసి ప్రజలను వంచించారని ఆరోపించారు. ఇది డిక్లరేషన్‌లను బుట్టదాఖలు చేసిన దోకేబాజ్ బడ్జెట్ అని అన్నారు ఈ బడ్జెట్‌కు ఒక విధానంగానీ, విషయంగానీ, విజన్‌గానీ లేదని.. కేవలం పథకాల పేర్ల మార్పులతో ఏమార్చారని విమర్శించారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగిందని, అన్నదాతలకు సున్నం పెట్టారని ఆరోపించారు. దళితులను దగా చేశారని, గిరిజనులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీలకు ఇచ్చిన మాటలన్నీ నీటి మూటలయ్యాయని మండిపడ్డారు.

## తెలంగాణలో నేడు భారీ వర్షాలు

**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

నేడు తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో.. కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగామ, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంది. నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

# హైదరాబాద్ అభివృద్ధికి 10 వేల కోట్లు



**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లు, ఆర్వోబీల వంటి రవాణా వ్యవస్థల ఏర్పాటుతో పాటు నాలాల పూడికతీత, వరద మళ్లింపు నిర్మాణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్-సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి రూ.2,675.35 కోట్లు సహా జీహెచ్ఎంసీకి రూ.3,075.7 కోట్లు కేటాయించింది. అలాగే హెచ్ఎండీఏకు రూ.500 కోట్లు కేటాయించారు. హెచ్ఎండీఏ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రూ.3,800 కోట్లు కావాల్సి ఉన్నందున ఈ కేటాయింపు దేనికి సరిపోతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జలమండలికి ఈ బడ్జెట్‌లో రూ.3,385 కోట్లు కేటాయించగా, ఇందులో అభివృద్ధి పనులకు రూ.1,450 కోట్లు, సుంకిశాల ప్రాజెక్టుకు రూ.1,000 కోట్లు, ఉచిత మంచినీటి పథకానికి రూ.300 కోట్లు వెచ్చించనున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మొదలుపెట్టిన సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి అరకొర కేటాయింపులే జరిపారు. మూడు దవాఖానలతో వరంగల్‌లోని దవాఖానల నిర్మాణానికి కలిపి రూ.260 కోట్లు మాత్రమే కేటాయించారు.

# చేనేత, వస్త్రశాఖకు రూ. 355 కోట్లు



**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

చేనేత, వస్త్ర శాఖకు ప్రభుత్వం రూ.355కోట్లు కేటాయించింది. విద్యార్థుల యూనిఫామ్స్, దవాఖానల్లో ఉపయోగించే బెడ్‌షీట్లు వంటివి చేనేత సహకార సంఘాల ద్వారా సేకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. ఇందులో బతుకమ్మ చీరల ప్రస్తావన లేకపోవడం గమనార్హం బడ్జెట్‌లో చేనేత కార్మికులకు ఆర్థిక సహకారం(ఫైనాన్షియల్ అసిస్టెన్స్) కింద రూ.153కోట్లు, కార్మికుల బీమాకు రూ.15కోట్లు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రమోషన్‌కు రూ.187కోట్లు కలిపి మొత్తం రూ.355కోట్లు కేటాయించారు. అలాగే, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు కేంద్రం అంగీకరించిందని, త్వరలో ఏర్పాటు చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ప్రకటించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ ఏర్పాటుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా, గత ప్రభుత్వం ఏటా చేనేత కార్మికులను ఆదుకునేందుకు రూ. 500కోట్లు కేటాయించేది. ఇందులో బతుకమ్మ చీరలకే రూ. 300నుంచి రూ.350కోట్లు చెల్లించేవారు. 35వేలమంది చేనేత కార్మికులకు సంవత్సరమంతా చేతినిండా పని దొరికేది. కాగా, ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో బతుకమ్మ చీరల పథకం ప్రస్తావన కూడా తేలేదు.

## వేతనాలు తీసుకుంటారు అసెంబ్లీకి రారు

- బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**



కొందరు వేతనాలు తీసుకుని అసెంబ్లీకి కూడా రావడం లేదని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. తాను ఎమ్మెల్యేగా అనవసరంగా గెలిచి అసెంబ్లీకి వచ్చానని బాధగా అనిపిస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు బాధాకరంగా ఉన్నాయన్నారు. లోపల ఒకరినొకరు తిట్టుకుని బయట మాత్రం చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారని విమర్శించారు. జిల్లా పరిషత్ చైర్మెన్‌గా పనిచేసిన తనకు సభలో ఎలా వ్యవహరించాలో తెలుసని చెప్పారు. గతంలో అసెంబ్లీ మీదుగా వెళ్లేటప్పుడు ఎప్పుడెప్పుడు అసెంబ్లీకి వెళ్తానా అని అనుకునే వాడినని, ప్రజలకు ఎమ్మెల్యేలు మంచి చేస్తారని భావించేవాడినని గుర్తుచేసుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, ఎన్టీఆర్ హయంలో శాసనసభకు ఒక విలువ ఉండేదన్నారు.

ఇద్దరు నాయకులు మాట్లాడితే మిగతా 60 మంది వారికి భజన చేస్తున్నారని దుయ్యబట్టారు. అసలు అసెంబ్లీలో ప్రజల గురించి మాట్లాడే నాయకులే లేరని, ప్రజా సమస్యల గురించి ప్రస్తావించాలన్న ఆలోచన కూడా వారికి ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఘోష నేతలకు వినపడడం లేదన్నారు. అంతమాత్రాన తానేం సత్యహరిశ్చంద్రుడిని కాదని చెప్పుకొచ్చారు.వేతనం తీసుకునే వ్యక్తులు కొందరు అసలు అసెంబ్లీకి రావడం లేదని, ఉద్యోగులు విధులకు రాకపోతే ఏ విధంగా వేతనం కట్ చేస్తారో.. అసెంబ్లీకి రాని వారి వేతనాలు కట్ చేయాలన్నారు. ఇది ప్రజల సొమ్ము అన్నారు. తాను ఏ ఒక్కరోజు రాకున్నా..అసెంబ్లీకి రిటర్న్ చేస్తా.. ఒకవేళ తీసుకోపోతే అసెంబ్లీ ముందు ప్రజలకు పంచుతానని చెప్పారు.

## యువతలో నైపుణ్యాలకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు

- రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

: ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించే అగ్రగామి గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్ది.. స్థానికంగాను, విదేశాల్లోనూ సులభంగా ఉద్యోగాలు పొందడానికి కావాల్సిన ప్రపంచస్థాయి నైపుణ్యాలను తెలంగాణ యువకుల్లో పెంపొందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగంలో ఆయన ఈ విషయం చెప్పారు. ఇదే ధ్యేయంతో తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే హైదరాబాద్‌లో పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో 'తెలంగాణ నైపుణ్యాల విశ్వవిద్యాలయంను స్థాపించి, నడిపించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ విశ్వవిద్యాలయంలో వివిధ పరిశ్రమలకు అవసరమైన 17 రకాల నైపుణ్యాలను నేర్పనున్నట్లు



చెప్పారు. వీటిలో సర్టిఫికెట్, డిప్లమో, డిగ్రీ కోర్సులు ఉంటాయన్నారు. ఈ స్కిల్ యూనివర్సిటీ నేరుగా పరిశ్రమలతో అనుసంధానించబడి ఉంటుందని.. అధ్యయనం, ఆచరణల మధ్య అంతరంలేని విధంగా ఉద్యోగార్జనే ఏకైక లక్ష్యంగా ఈ కోర్సుల బోధనాంశాలకు రూపకల్పన చేస్తామని మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# సాగునీటి రంగానికి రూ. 22,301కోట్లు



**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర బడ్జెట్‌లోకాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి రంగానికి ఏకంగా రూ.22,301 కోట్లను కేటాయించింది. రాష్ట్రప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయిలో బడ్జెట్‌లో సాగునీటి రంగంలో నూతన ప్రాజెక్టుల నిర్మాణం కంటే, తుది దశలో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి మొగ్గుచూపింది.సాగునీటి రంగంలో తుదిదశలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆయకట్టు పెంచే 18 ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలతో కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టిందని, ఎన్డీఎస్ఏ సూచనల ఆధారంగా ప్రాజెక్టును కాపాడుకుంటామని ప్రకటించింది. నీటి పారుదల శాఖకు ఈ బడ్జెట్‌లో 22వేల 301 కోట్ల రూపాయలను కేటాయించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 34భారీ ప్రాజెక్టులు , మరో 39 మధ్యతరహా ప్రాజెక్టులతో కలిపి మొత్తం 73 ప్రాజెక్టులు చేపడితే అందులో 42 ప్రాజెక్టులు(10 భారీ ప్రాజెక్టులు , 32మధ్యతరహా ప్రాజెక్టులు) పూర్తి ఆయ్యాయి.

మరో 31 ప్రాజెక్టులు (24భారీ ప్రాజెక్టులు, 7 మధ్యతరహా ప్రాజెక్టులు)నిర్మాణదశలో ఉన్నట్టు ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు ప్రాజెక్టులను ఈ ఏడాది, 12 ప్రాజెక్టులను వచ్చే ఏడాది పూర్తి చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. దీంతోపాటు ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తొందరపాటు నిర్ణయాలు, డిజైన్లలో లోపాలు, నాణ్యతారహితంగా చేసిన నిర్మాణాలు ఆ ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుపై చేసిన ఆర్భాటపు ప్రచారాలతో రైతులు దీనిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నట్టు తెలిపారు. కాని కొద్దికాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు డొల్లతనం బయటపడి రాష్ట్రం అంతా దిగ్భ్రాంతికి గురయిందన్నారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవక తవకలను గుర్తించి తగిన చర్యలను సూచించేందుకు విచారణ కమిటిని నియమించినట్టు వెల్లడించారు.

ఈ న్యాయ విచారణ కమిటి ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోటం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే ఖర్చు పెట్టిన వేల కోట్ల ప్రజాధనం వృధా కాకుండా ప్రాజెక్టును కాపాడేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటి నిపుణుల సూచనలకు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టుపై విచారణ కమిటీని నియమించామని, నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయన్నారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఆయకట్టు విస్తీర్ణం పెంచాలని సంకల్పించింది. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో సాగునీటి పారుదల రంగానికి రూ. 22,301 కోట్లు కేటాయించామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

# విమాన టికెట్ల ధరలను కేంద్రం నియంత్రించలేదు

- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

**బలగం టీవి , న్యూఢిల్లీ బ్యూరో**

విమాన టికెట్ల ధరలు ప్రభుత్వ నియంత్రణలో ఉండవని,ఎయిర్‌లైన్స్‌లో టికెట్లు బుక్ చేసుకోవడానికి ఎంపీలు ప్రయత్నించినపుడు టికెట్ల ధరలు అమాంతం పెరిగిపోతున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు లోక్‌సభకు హామీ ఇచ్చారు. ఎంపీలు చేసిన ఫిర్యాదుతోపాటు స్పీకర్ ఓం బిర్లా చేసిన ప్రస్తావనపై మంత్రి గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానమిచ్చారు.చెన్నై-ఢిల్లీ రూట్‌లో ఎయిర్ విస్తారాలో టికెట్ బుక్ చేయడానికి తాను ప్రయత్నించిన ప్రతిసారి టికెట్ ధర దాదాపు రూ. 25,000 వరకు చూపుతోందని డీఎంకె సభ్యుడు దయానిధి మారన్ అనుబంధ ప్రశ్న వేశారు. అయితే తాను బుకింగ్ ప్రక్రియ పూర్తి చేసే సమయానికి టికెట్ ధర మూడు రెట్లు పెరిగి ఉంటుందని ఆయన చెప్పారు. విస్తారా నిర్వహించే అదే టాటా గ్రూపునకు చెందిన సాఫ్ట్‌వేర్ దిగ్గజం టిసిఎస్ టికెట్ ధర పెరిగే విధంగా ఏదైనా టెక్నాలజీనివాడుతోందా అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. స్పీకర్ ఓం బిర్లా మధ్యలో జోక్యం చేసుకుంటూ పలువురు ఎంపీల నుంచి తనకు కూడా ఇదే విషయమై ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఎంపీల టికెట్ల ఖర్చు పార్లమెంట్ నుంచి వెళుతున్నందున దీనిపై దర్యాప్తు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ ఈ అంశంపై దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చారు.



మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ తాను పౌర విమానయాన మంత్రిత్వశాఖను చేపట్టిన నాటి నుంచి విమాన ప్రయాణం సామాన్యులకు అందుబాటులో ఉండేవిధంగా ప్రయత్నిస్తున్నానని చెప్పారు. అయితే విమాన టికెట్ల ధరలు ప్రభుత్వ నియంత్రణలో ఉండవని ఆయన చెప్పారు. తమ మంత్రిత్వశాఖకు సంబంధించినంత వరకు కస్టమర్‌ను కింగ్‌గా భావిస్తామని, ప్రయాణికుల సౌకర్యాలకే ప్రాధాన్యతనిస్తామని ఆయన చెప్పారు. భారతీయ లేదా విదేశీ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన టికెట్ల చారీలను ప్రభుత్వం నియంత్రించలేదని ఆయన తెలిపారు. సీజన్, సెలవులు, పండుగలు, ఏవియేషన్ టర్బైన్ ఇంధనం ధర, పోటీతత్వం వంటి అనేక కారణాలు టికెట్ల ధరలపై ప్రభావం చూపుతాయని రామ్మోహన్ నాయుడు వివరించారు.

# ఆగస్టు 1న తెలంగాణ మంత్రివర్గం భేటీ

**బలగం టీవి , హైదరాబాద్ బ్యూరో**

ఆగస్టు 1వ తేదీన తెలంగాణ మంత్రివర్గం భేటీ కానుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు మంత్రి మండలి సమావేశం జరగనుంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆగస్ట్ 2వ తేదీన ముగియనున్నాయి. గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రవేశపెట్టగా బడ్జెట్‌పై చర్చ అనంతరం ద్రవ్య వినిమయ బిల్లుకు ఈ నెల 31వ తేదీన అసెంబ్లీ ఆమోదం తెలపనుంది. అనంతరం ఆగస్ట్ 2న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. అయితే అసెంబ్లీ సమావేశాల ముగింపునకు ఒక్క రోజు ముందే తెలంగాణ కేబినెట్ భేటీ కానుండటం ఆసక్తిగా మారింది. ఈ భేటీకి సంబంధించిన అజెండా ఏంటన్నది తెలియనప్పటికీ జాబ్ క్యాలెండర్, రైతు భరోసా గైడ్ లైన్స్‌కు సంబంధించిన అంశాలపై మంత్రివర్గంలో చర్చించనున్నట్లు సమాచారం.

## 27కు అసెంబ్లీ వాయిదా

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలను ఈ నెల 27కు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం కానుంది. ఇక బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 26, 28, 29, 30 తేదీల్లో సభకు సెలవు ప్రకటించారు. 27న బడ్జెట్‌పై చర్చ చేపట్టి, అదే రోజు ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరపనున్నారు. అదే రోజు పలు బిల్లులను సభ ముందుంచి ఆమోదించనున్నారు. ఆగస్టు 1, 2 తేదీల్లోనూ పలు బిల్లులను సభలో ప్రవేశపెట్టనున్నారు.

# ఒలింపిక్స్ అర్చరీలో భారత్ శుభారంభం



**బలగం టీవి , ప్యారిస్**

పారిస్ ఒలింపిక్స్ లో భారత మహిళల అర్చరీ జట్టు శుభారంభం చేసింది..టీమ్ క్వాలిఫైడ్ ఈవెంట్ లో 1983 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. దీంతో క్వార్టర్ ఫైనల్స్ కు దూసుకు వెళ్లారు.. భజన కౌర్, దీపిక కుమారిలతో పాటు అంకిత భకత్ అద్భుత ప్రదర్శన చేయడంతో భారత్ టాప్-4లో నిలిచింది.ఈ ముగ్గురు ఆర్చర్లు కలిసి 1983 పాయింట్లు సాధించారు. క్వార్టర్ ఫైనల్‌లో భారత మహిళా ఆర్చరీ జట్టు ఫ్రాన్స్ వర్సెస్ నెదర్లాండ్స్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్ విజేతతో తలపడాల్సి ఉంటుంది. ఒకవేళ భారత్ క్వార్టర్ ఫైనల్ లో విజయం సాధిస్తే కొరియాతో తలపడే అవకాశం ఉంటుంది.

వ్యక్తిగత విభాగంలో అంకిత తృటిలో టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయింది. 666 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచింది. వెటరన్ దీపిక 658 పాయింట్లతో 23వ స్థానంలో నిలవగా, భజన్ కౌర్ 659 స్కోరుతో 22వ స్థానంలో నిలిచింది.ఇక వ్యక్తిగత విభాగంలో భజన కౌర్, దీపిక కుమారి, అంకిత భకత్ లు అర్హత సాధించారు. అంకిత్ భగత్ 666 పాయింట్లతో 11వ స్థానం, భజన్ కౌర్ 659 పాయింట్లతో 22వ స్థానం, దీపికా కుమారి 658 పాయింట్లతో 23వ స్థానంలో నిలిచారు.. దీంతో 64మంది పాల్గొనే ఈ పోటీలలో పాల్గొనే అర్హత సాధించారు.




## మైదానంలోకి దూసుకొచ్చిన అభిమానులు

**బలగం టీవి , ప్యారిస్**

పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. అయితే ఒలింపిక్స్ పోటీలు మాత్రం ఒక రోజు ముందు నుంచే మొదలయ్యాయి. ఫుట్‌బాల్‌లో తొలి మ్యాచ్ అయిన మొరాకో-అర్జెంటీనా పోరు వివాదంగా మారింది. అభిమానులు మైదానంలో దూసుకొచ్చి రచ్చరచ్చ చేశారు. దీంతో మ్యాచ్ దాదాపు రెండు గంటలపాటు ఆలస్యమైంది. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత మ్యాచ్‌ను కొనసాగించారు. అయితే నాటకీయ పరిమాణాల మధ్య సాగిన ఈ మ్యాచ్‌లో రెండు సార్లు స్వర్ణ పతక విజేత అర్జెంటీనాను మొరాకో 2-1 తేడాతో ఓడించింది గ్రూప్-బీలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత 2-2తో స్కోరు సమంగా భావించారంతా. కానీ ఆ తర్వాతే అసలు మలుపు తిరిగింది. మొరాకో ప్లేయర్ రహిమి తమ జట్టుకు రెండు గోల్స్ అందించాడు. 45వ, 51 వ నిమషంలో గోల్ కొట్టాడు. మరోవైపు అర్జెంటీనా ఆలస్యంగా స్కోరు ఖాతాను ఆరంభించింది. 68వ నిమిషంలో సిమోన్ గోల్ సాధించాడు. ఆ తర్వాత మొరాకో తన ఆధిక్యాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగింది. కానీ ఇంజ్యూరీ టైమ్‌లో అర్జెంటీనా ఆటగాడు క్రిస్టియన్ మెదినా గోల్ సాధించాడు. దీంతో స్కోరు 2-2తో సమం అయ్యింది. కానీ అది సరైన గోల్ కాదని, మొరాకో అభిమానులు నిరసన తెలుపుతూ మైదానంలోకి వచ్చారు. అంతేగాక అర్జెంటీనా ఆటగాళ్లపై వాటర్ బాటిళ్లు, ఇతర వస్తువులు విసిరారు. దీంతో స్టేడియంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో అధికారులు మ్యాచ్‌ను నిలిపివేశారు. ప్రేక్షకులందరినీ బయటకు పంపించారు. మరోవైపు మ్యాచ్‌ను సస్పెంట్ చేశారని ఫిఫా వెబ్‌సైట్‌తో సహా ప్రముఖ వెబ్‌సైట్‌లు ప్రకటించాయి. కానీ ఆ తర్వాత మ్యాచ్‌ను కొనసాగించారు. అంతకుముందు అర్జెంటీనా చేసిన గోల్‌ను కౌంట్ చేయలేదు. అది ఆఫ్‌సైడ్‌గా ప్రకటించారు. అనంతరం ఆట తిరిగి ప్రారంభమైంది. అయితే మూడు నిమిషాలే మిగిలి ఉన్న ఆటలోఅర్జెంటీనా మరో గోల్ చేయలేకపోయింది. దీంతో 1-2తో మ్యాచ్‌ను కోల్పోయింది గ్రూప్-సీలో జరిగిన మ్యాచ్‌ల్లో ఉజ్బెకిస్థాన్‌పై స్పెయిన్ 2-1తో గెలిచింది. స్పెయిన్ తరపున పుబిల్ మార్క్ (29వ ని.), సెర్గియో (62వ ని.) గోల్స్ చేశారు. మరో మ్యాచ్‌లో న్యూజిలాండ్ 2-1తో గినియాపై నెగ్గింది.

## రెప్పల్ డప్పుల్ విడుదల

**బలగం టీవి , హైదరాబాద్**

మాస్ మహారాజా రవితేజ, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మిస్టర్ బచ్చన్' మ్యూజిక్ ప్రమోషన్లు ఫస్ట్ సింగిల్ సితార్‌కు అద్భుతమైన స్పందనతో చార్ట్ బస్టర్ నోట్‌లో ప్రారంభమయ్యాయి. గురువారం మేకర్స్ సెకండ్ సింగిల్ రెప్పల్ డప్పుల్‌ను విడుదల చేశారు. ఇది ఫస్ట్ సింగిల్‌కి చాలా డిఫరెంట్ గా వుంది. రెప్పల్ డప్పుల్ హైలీ ఎనర్జిటిక్ బీట్‌లతో కూడిన పూర్తి మాస్ నంబర్. మ్యూజిక్ కంపోజిషన్, ట్యూన్ లో ఈ మాస్ నంబర్‌ను మాసీ బ్లాక్‌బస్టర్‌గా మార్చేలా కంపోజ్ చేశారు మిక్కీ జె మేయర్. ఆర్కెస్ట్రేషన్ అద్భుతంగా వుంది. సింగర్స్ అనురాగ్ కులకర్ణి, మంగ్లీ తమ స్పెషల్ వోకల్స్‌తో ఎక్స్‌ట్రార్డినరీగా పాడారు. కాసర్ల శ్యామ్ లిరిక్స్ ఈ ఎలక్ట్రిఫైయింగ్ డ్యాన్స్ నంబర్ బీట్‌లను పర్ఫెక్ట్‌గా మ్యాచ్ చేశాయి. రవితేజ, భాగ్యశ్రీ బోర్సే డ్యాన్స్ ఫ్లోర్‌ని అదరగొట్టారు. ఈ మాస్ బ్లాక్‌బస్టర్‌కు భాను మాస్టర్ అద్భుతంగా కొరియోగ్రఫీ చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. మిస్టర్ బచ్చన్ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది.

# నేడు సెమీస్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ

**మధ్యాహ్నం 2:00 గంటలకు మ్యాచ్**




**బలగం టీవి , కొలంబో**

శ్రీలంక గడ్డపై జరుగుతున్న మహిళల ఆసియా కప ఆఖరి అంకానికి చేరింది. సెమీస్ పోరుకు నేటితోతెరలేవనుంది. శుక్రవారం మధ్యాహ్నం 2:00 గంటలకు బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న భారత జట్టు దంబుల్లా స్టేడియం వేదికగా బంగ్లాదేశ్‌తో తలపడనుంది. మరో మ్యాచ్‌లో రాత్రి 7:00 గంటలకు ఆతిథ్య శ్రీలంక రెండో సెమీస్‌లో పాకిస్థాన్‌తో ఆడనుంది.

టీమిండియా వరుసగా రెండో ఏడాది ఫైనల్ చేరడం ఖాయమనిపిస్తోంది. ఆసియా కప్‌లో తిరుగులేని రికార్డు ఉన్న భారత జట్టు టైటిల్ వేటను ఘనంగా మొదలెట్టింది. ఏడు సార్లు ఆసియా కప్ గెలుపొందిన టీమిండియా తొలి మ్యాచ్‌లోనే పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించింది. స్పిన్నర్ దీప్తి శర్మ (3/20) విజృంభణతో పాక్‌ను 108కే ఆలౌట్ చేసి.. స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించింది. అనంతరం యూఏఈపై రికార్డు స్కోర్‌తో హర్మన్‌ప్రీత్ బృందం చరిత్ర సృష్టించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(66 నాటౌట్), రీచా ఘోష్(64 నాటౌట్)లు అర్ధ శతకాలతో చెలరేగగా ప్రత్యర్థికి 202 పరుగుల లక్ష్యాన్నినిర్దేశించింది. దీప్తి శర్మ(2/23) మరోసారి తప్పేయడంతో యూఏఈపై 78 పరుగుల భారీ విజయం మూటగట్టుకుంది. ఇక మూడో మ్యాచ్‌లో నేపాల్‌పై భారత్ 82 పరుగులతో గెలుపొంది సెమీస్‌కు దూసుకెళ్లింది.

ప్రస్తుతం భారత జట్టులోని వాళ్లంతా ఫామ్‌లో ఉన్నారు. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధానాలు విధ్వంసంక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తిస్తున్నారు. మిడిలార్డర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్‌లు ధనాధన్ ఆడుతూ అవతలి జట్లను భయపెడుతున్నారు. ఇక బౌలింగ్ యూనిట్ సైతం పటిష్టంగా ఉంది.పేసర్ రేణుకా సింగ్, అరుంధతీ రెడ్డి, యువ ఆల్‌రౌండర్ పూజా వస్త్రాకర్‌లు పవర్ ప్లేలోనే వికెట్లు తీసి బ్రేకిస్తున్నారు. ఇక మిడిల్ ఓవర్లలో స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్‌లు తిప్పేస్తున్నారు. దాంతో.. బంగ్లాదేశ్‌తో జరిగే సెమీస్‌లో భారత జట్టు ఆత్మవిశ్వాసంతో ఆడనుంది. మరోవైపు థాయ్‌లాండ్, మలేషియాలపై గెలుపొందిన బంగ్లా.. టీమిండియాకు గట్టి పోటీనివ్వాలని భావిస్తోంది.

# నేడే 'ఆపరేషన్ రావణ్' విడుదల

**బలగం టీవి , హైదరాబాద్**



రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకటసత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. సంగీర్తన విపిన్ కథానాయిక. ఈ సినిమాలో రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రను పోషిస్తున్నారు. నేడు విడుదలకానుంది. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు మారుతి అతిథిగా హాజరయ్యారు. న్యూఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందించే చిత్రమిదని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. గాఢమైన ప్రేమబంధం వయొలెంట్‌గా ఎందుకు మారిందనే అంశంతో ఈ సినిమాను తెరకెక్కించామని, లవ్‌స్టోరీస్‌లో డిఫరెంట్ కాన్సెప్ట్ ఇదని దర్శకుడు వెంకటసత్య తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ - "ఆపరేషన్ రావణ్" సినిమా ఎప్పుడు రిలీజ్ చేస్తున్నారని వెంకట సత్య గారిని అడిగేవాడిని. ఆయన మంచి టైమ్ చూసుకుని చేయాలని అనుకుంటున్నామని అనేవారు. ఈ నెల 26న మంచి డేట్ కు రిలీజ్ కు వస్తున్నారు. నేను ఆరు నెలల కిందట ఈ సినిమా చూశాను. చాలా బాగుంది. వాళ్ల అబ్బాయిని హీరోగా పెట్టి వెంకట సత్య గారు థ్రిల్లర్ సినిమాను రూపొందించడం మామూలు విషయం కాదు. బాలీవుడ్ లో ఇలా కొందరు ఫాదర్ సన్ సక్సెస్ అయ్యారు. తెలుగులో ఇప్పుడు రక్షిత్, వెంకట సత్య గారు చేస్తున్నారు. లండన్ బాబులు అనే మూవీతో మెల్లిగా మొదలైన రక్షిత్ జర్నీ పలాసతో పీక్స్ కు వెళ్లింది. ఆ సినిమాలో తన నటనతో మెస్మరైజ్ చేశాడు రక్షిత్. అతనిలో పట్టుదల అంకితభావం ఉన్నాయి. మన పక్కింటి కుర్రాడిలా అనిపిస్తాడు. "ఆపరేషన్ రావణ్" సినిమాతో రక్షిత్ మరింత మంచి పేరు తెచ్చుకోవాలి. ఈ మాస్క్ మ్యాన్ ఎవరు అనే క్యూరియాసిటీ క్రియేట్ చేశారు వెంకట సత్య గారు. "ఆపరేషన్ రావణ్" టీమ్ అందిరకీ ఆల్ ది బెస్ట్. అన్నారు

## తనికెళ్ల భరణికి గౌరవ డాక్టరేట్

**బలగం టీవి , హైదరాబాద్**



సుప్రసిద్ధ కవి, మాటల రచయిత, రంగస్థల నటుడు, నటుడు దర్శకుడు తనికెళ్ల భరణికి వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీగౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 52 సినిమాలకు మాటలను అందించి రచయితగా అనేక విజయాలను అందుకున్నారు ఆయన. రాష్ట్ర ప్రభుత్వం నుండి 'సముద్రం' సినిమాకు ఉత్తమ విలన్‌గా, 'నువ్వు నేను' సినిమాలోని నటనకు ఉత్తమ క్యారెక్టర్ నటునిగా, 'గ్రహణం'తో ఉత్తమ నటునిగా, 'మిథునం' సినిమాకు గాను ఉత్తమ రచయిత , ఉత్తమ దర్శకునిగా అయిదు నంది అవార్డులను అందుకున్నారాయన. ఎస్ఆర్ యూనివర్శిటి ప్రకటించిన ఈ అవార్డును ఆగస్ట్ 3న వరంగల్‌లో జరిగే యూనివర్శిటి స్నాతకోత్సవ వేడుకలో ఆయనకు ప్రధానం చేయనున్నారు. 40 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ విద్యా సంస్థ యూనివర్శిటిగా మారిన తర్వాత ఆస్కార్ అవార్డు గ్రహిత చంద్రబోస్‌ను ఇంతకు ముందు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. తాజాగా తనికెళ్ల భరణికి కూడా ఆ గౌరవ పురస్కారం లభించింది.